గెస్ట్ లెక్చరర్ల దరఖాస్తులకు ఆహ్వానం

శంషాబాద్: పట్టణంలోని రాజేంద్రనగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (శంషాబాద్)లో 2024–25 విద్యాసంవత్సరానికి గెస్ట్ లెక్చరర్స్‌గా పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు ఓ ప్రకటనలో తెలిపారు. ఆంగ్లం, హిందీ, తెలుగు, అరబిక్, కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్ సబ్జెక్టుల్లో ఒక్కోపోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో నెట్, సెల్ట్, సెట్,లతో పాటు పీహెచ్‌డీ బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హులైన ఔత్సాహిక అభ్యర్థులు ఈనెల 6న మినీ స్టేడియంలోని డిగ్రీ కళాశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో గురువారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ రూ.10.50 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నారని కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. గొలిదొడ్డిలో రూ.2.30 కోట్లు, వట్టినాగులపల్లిలో రూ. 1.85 కోట్లు,, ఖానాపూర్‌లో రూ.2.85 కోట్లు, గండిపేట్‌లో రూ.1.70 కోట్లు, కోకాపేట్‌లో రూ.1.80 కోట్లతో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని వివరించారు. ఉదయం 10 గంటలకు గొలిదొడ్డి నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కమిషనర్ కోరారు.

పండుగలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

అత్తాపూర్: వినాయక చవితి నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించుకోవాలని అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటరామిరెడ్డి సూచించారు. సాంస్కృతి సంప్రదాయబద్ధంగా చేసుకుంటున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకునేందుకు నిర్వాహకులు ఏర్పాటు చేసుకుంటారన్నారు. ఈ క్రమంలో ఎలాంటి అపరిచితులు దొరలకుండా ఉండేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. మండపాలకు వినాయకులను తరలించే క్రమంలో విద్యుత్ అంతరాయం లేకుండా సంబంధిత అధికారులకు ముందస్తు సమాచారం అందించాలని కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, కౌన్సిలర్

శంషాబాద్: పట్టణంలోని 6వ వార్డులో అస్తవ్యస్తంగా ఉన్న పాతగొల్లపల్లి రోడ్డు నుంచి ఖాజీగల్లీ వరకు కౌన్సిలర్ వై.కుమార్ చొరవతో ఎట్టకేలకు రోడ్డు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. రూ. 30 లక్షలతో ఈ రోడ్డు పనులను చేపడుతున్నారు. రోడ్డు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మతో కలిసి కౌన్సిలర్ వై.కుమార్ పరిశీలించారు. ఆరో వార్డులో అన్ని బస్తీల్లో సీసీరోడ్డు పనులను వేగవంతం చేయాలని సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎట్టకేలకు సీసీ రోడ్డు పనులు ప్రారంభించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

గుంతలు.. చింతలు



మండలంలోని జూకల్-కాచారం మార్గంలో ఇలా..

- వర్షాలకు దెబ్బతిన్న రహదారులు
- భారీ గుంతలతో వాహనదారుల అవస్థలు

శంషాబాద్ రూరల్: అడుగడుగునా గుంతలు.. రహదారుల్లో నిలుస్తున్న వరదనీరు.. వర్షాలకు రోడ్లు అధ్వానంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని వివిధ గ్రామాల రోడ్లు దెబ్బతినడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. విస్తరణ పనులు అసంపూర్తిగా ఉన్నచోట ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాపోతున్నారు.

శంషాబాద్-షాబాద్ రహదారిలో కవేలిగూడ చౌరస్తా, కాచారం శివారులో మూల మలుపు వద్ద భారీ గుంతలు ప్రమాదకరంగా మారాయి. రాయన్నగూడ-కేబీ.దొడ్డి మార్గంలో అసంపూర్తిగా ఉన్న విస్తరణ పనులతో రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. కాచారం-జూకల్ మార్గంలో భారీ గుంతలు ఏర్పడ్డాయి. సుల్తాన్‌పల్లి-కేబీ.దొడ్డి మార్గంలో ఎంటేరువాగుపై వరద ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోయాయి. తొండుపల్లి-హమీదుల్లానగర్ మార్గంలో సైతం గుంతలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



సుల్తాన్‌పల్లి-కేబీ.దొడ్డి రోడ్డుపై వరద ప్రవాహం

పంచాయతీ విలీనం వద్దు

ఘాంసిమియాగూడ వాసుల ఆందోళన



వినతిపత్రం అందజేస్తున్న ఘాంసిమియాగూడ వాసులు

శంషాబాద్ రూరల్: గ్రామసభ నిర్వహించకుండా ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి చేసిన తీర్మానాల ఆధారంగా ఘాంసిమియాగూడ పంచాయతీని మున్సిపాలిటిలో విలీనం చేయడం తగదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. శంషాబాద్ మండలంలోని రషీద్‌గూడ, హమీదుల్లానగర్, పెద్దగోల్కొండ, చిన్నగోల్కొండ, బహదూర్‌గూడ, ఘాంసిమియాగూడ పంచాయతీలను శంషాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేస్తూ.. ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేయడంతో స్థానికంగా తీవ్ర వ్యతిరేకత నెలకొంది. కూలీ పనులు, సాగుపై ఆధారపడిన గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేస్తే పేదలు, మధ్యతరగతి ప్రజలపై పన్నుల భారం పడుతుందని ఆందోళన చెందుతున్నారు. ఔటర్ వెలుపల ఉన్న ఘాంసిమియాగూడ పంచాయితీని ఇష్టానుసారంగా విలీనం చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కేవలం అధికారులు రూపొందించిన తీర్మానంతో విలీనం ఎలా చేస్తారని మండిపడ్డారు. బుధవారం పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. గ్రామంలో రైతులు సాగుచేస్తున్న భూములకు పట్టా పాసుపుస్తకాలు లేవన్నారు. పంచాయతీలో ఎలాంటి అభివృద్ధి కూడా జరగలేదన్నారు. పంచాయతీ రికార్డులను అప్పగించొద్దని పంచాయతీ కార్యదర్శిని కోరారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఈ విషయంపై వినతిపత్రం అందజేశారు.

మిల్లెట్స్‌పై బిహార్ రైతులకు శిక్షణ

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్‌లో బిహార్‌లోని గయాకు చెందిన రైతులకు మిల్లెట్స్‌పై మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ బుధవారం ప్రారంభమైంది. ఐఐఎంఆర్ డైరెక్టర్ సీతారా సత్యవతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు మిల్లెట్స్ పంటలపై పలు సూచనలు చేశారు. మినుము ఉత్పత్తి ప్రాసెసింగ్‌కు సంబంధించిన సాంకేతికతపై అనుభవాన్ని పెంచుకోవాలని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న వాటిని పాటిస్తే తప్పనిసరిగా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. జొన్న, రాగులు, మినుములు, గోధుమలు, సజ్జలు వీటిపై ఎక్కువ దృష్టి సారించాలని సూచించారు. వీటితో పాటు రైతు ఉత్పత్తి సంస్థల ఏర్పాటు వాటి ప్రయోజనాల గురించి వివరిస్తామన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సంగప్ప, సీనియర్ సైంటిస్ట్ సేవా నాయక్, డాక్టర్ మహేష్‌కుమార్ పాల్గొన్నారు.



సూచనలు ఇస్తున్న డైరెక్టర్ తారా సత్యవతి

ఊట్‌పల్లి ఫిరంగి నాలాను పరిరక్షించండి

శంషాబాద్: పట్టణంలోని ఊట్‌పల్లి సర్వేనంబరు 30 పరిధిల కిలోమీటరు మేరకు ఫిరంగి నాలాను ఓ ప్రైవేటు వ్యక్తి తన ఆధీనంలో తీసుకున్నాడని పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన ప్రహరీ లోపల ఉన్న ప్రభుత్వ భూముల సరిహద్దులను సూచిస్తున్న దిమ్మెలను మీడియాకు చూపించారు. దీనిపై హైడ్రాకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఇరిగేషన్ అధికారుల వైఫల్యంతోనే ఫిరంగి నాలా అనేక చోట్ల ఆక్రమణలకు గురైందన్నారు. అధికారులు సత్వరమే దీనిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ యాదవ్ తదితరులున్నారు.

బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశం



సమావేశంలో బీఆర్ఎస్ జాతీయ అధికార ప్రతినిధి కార్తిక్‌రెడ్డి

మణికొండ: స్థానిక పోరాట పార్టీపై ప్రేమ ఉన్నవారే బీఆర్ఎస్‌లో ఉన్నారని, కేవలం పదవులు, అధికారం కావాలనుకునే స్వార్థపరులే కాంగ్రెస్‌లోకి వెళ్లారని బీఆర్ఎస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి కార్తిక్‌రెడ్డి అన్నారు. బుధవారం నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్యకర్తలు, రాష్ట్రంపై ప్రేమాభిమానాలు ఉన్న వారిని నాయకులుగా తీర్చిదిద్ది గతంలో కంటే పటిష్టంగా పార్టీని తయారుచేస్తామన్నారు. నియోజకవర్గంలో అప్పటికే రెండు గ్రూపులు ఉండగా.. ఎమ్మెల్యే వెళ్లాక అవి కాస్తా.. మూడుకు పెరిగాయని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఉద్యమాలు చేద్దామని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ప్రజల్లో ఉంటూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాలను వారికి వివరించాలన్నారు. పేదలకు పెన్షన్, రైతుబంధు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలు అందరికీ అందకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరలోనే మున్సిపాలిటీల వారీగా పూర్తిస్థాయి కమిటీలను వేసి పార్టీని పునర్నిర్మిస్తామన్నారు. మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు మహమూద్ అలీ, ఫారూఖ్, జితేందర్, ఆనంద్, సయ్యద్ ఖురేషి, ముస్తాఫా, ఎం.నాగరాజు, మహేష్‌ముదిరాజ్, ప్రియదర్శిని, సత్తార్‌ఖాన్, గిరి, రమేష్‌బాబు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈసీ నదిలో చేపల వేట !

మొసళ్లు తిరుగుతున్నాయి తస్మాత్..



హిమాయత్‌సాగర్ జలాశయం వద్ద ప్రమాదకరంగా చేపల వేట..

బండ్లగూడ: ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు రావడంతో ఈసీ పరివాహక ప్రాంతమైన బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కిస్మత్‌పూర్ తదితర ప్రాంతాల్లో ఉల్లాసంగా ఉత్సాహంగా సరదాగా చేపల వేట కొనసాగిస్తూ.. ఈసీనదిలోకి వెళ్లేవారు జాగ్రత్తగా ఉంటాలని పలువురు సూచిస్తున్నారు.

గతంలో చేపల కోసమని గాలం వేస్తే..

గతంలో చేపల కోసమని గాలం వేస్తే రెండు మొసళ్లు వచ్చి గాలానికి చిక్కుకున్నాయి. ఇలా చేపల కోసం ఎరను కట్టి మరుసటి రోజు వచ్చి చిక్కిన మొసళ్లను చూసిన మత్స్యకారుడు ఆశ్చర్యపోయాడు. జంతు ప్రదర్శన శాల అధికారులకు సమాచారమివ్వడంతో ఊపిరాడక చిక్కిన రెండు మొసళ్లు చనిపోయినట్టుగా వారు గుర్తించారు. గతేడాది కూడా అత్తాపూర్ ఈసీనదిలో ఓ మొసలి దర్శనమిచ్చింది. బండపై విశ్రాంతి తీసుకుంటున్న మొసలిని చూసిన స్థానికులు హడలిపోయారు. ఇంకా మొసళ్లు ఉన్నట్టుగా స్థానికులు అనుమానిస్తున్నారు.

సాగర్ గేట్లు ఎత్తివేత సమయంలో..

ఈ మొసళ్లు హిమాయత్‌సాగర్ గేట్లు ఎత్తివేత సమయంలో ఈసీ చెరువులోకి వచ్చి ఉంటాయని అటవీ శాఖ అధికారులు గతంలో భావిస్తున్నట్లు తెలిపారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి..

గతంలో కార్పొరేషన్ పరిధి ఈసీ పరివాహక ప్రాంతాలలో అధికారులు ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు పాడైపోయాయన్నారు. ప్రస్తుతం అక్కడ సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి సూచిక బోర్డులను ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడికి గాయాలు

అత్తాపూర్: ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో ఓ యువకుడు జాయ్ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న ఘటన అత్తాపూర్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్కాన్ టెంపుల్ పాండురంగనగర్ ప్రాంతానికి చెందిన బాలాజీ గణేష్ మండపం నిర్వాహకులు గణేష్ నవరాత్రి వేడుకల్లో భాగంగా నవరాత్రి దూల్‌పేట్ నుంచి వినాయక విగ్రహాన్ని ప్రతిమను కొనుగోలు చేశాడు. మండపానికి ట్రాక్టర్ చేరవేసే క్రమంలో కరెంట్ వైర్లు తగలడంతో రమేష్ (34)తీవ్రంగా గాయపడ్డాడు. మొత్తం 60 మంది యువకులు ఉండగా.. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని అత్తాపూర్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

స్వచ్ఛ కార్మికులకే వ్యర్థాలను అందించాలి



పనులను పరిశీలిస్తున్న బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు తమ ఇంట్లోని చెత్తను ఇంటివద్దకు వచ్చే చెత్తసేకరణ ఆటో కార్మికులకు అందించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. బుధవారం కార్పొరేషన్ పరిధిలోని 10,11,12వ డివిజన్‌లలో చెత్త సేకరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 100 శాతం తడి, పొడి చెత్త సేకరణ జరపాలన్నారు. ప్రతి ఒక్క స్వచ్ఛ ఆటోడ్రైవర్ చెత్తను వేరుచేసి సేకరించాలని ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు యాదగిరి, తౌఫిక్, నరేందర్, సాట్ డ్రైవర్లు ఎల్లప్ప, ఓంకార్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

మణికొండ: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసింది. గండిపేట మండల పరిధి నుంచి ఏకంగా 8 మంది ఎంపిక కాగా.. వారిలో నార్సింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయుడు విజయ్‌కుమార్, ఇదే పాఠశాల ఉపాధ్యాయురాలు ఫిర్‌దోసు, ఉపాధ్యాయుడు శ్యామ్‌సుందర్‌రెడ్డి, మణికొండ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు దశరథ్‌నాయక్, హైదర్షాకోట్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మురళీధర్‌రావు, నార్సింగి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు మంజుల, ఖానాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు సీహెచ్ భాగ్యమ్మ, ప్రైవేటు పాఠశాలల విభాగంలో హ్యాపీ స్కాలర్స్ హైస్కూల్ ఉపాధ్యాయుడు ఆనంద్‌లు ఉన్నారు. వీరందరికీ తోటి ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

'మార్కెట్' రేసులో ఉన్నా



మన్నె గండయ్య

మణికొండ: 35 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉండటంతో పాటు మాజీ సర్పంచ్‌గా, ఓబీసీసెల్ జిల్లా కన్వీనర్‌గా, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రజలకు సేవ చేసిన తాను దశాబ్దకాలం తర్వాత పార్టీ అధికారంలోకి రావడంతో ప్రస్తుతం గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఆశిస్తున్నానని ఖానాపూర్ గ్రామానికి చెందిన మన్నె గండయ్య తెలిపారు. బుధవారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన 'నామినేటెడ్ పదవులపై నజర్' అనే శీర్షికన వచ్చిన కథనంపై నియోజకవర్గ వ్యాప్తంగా చర్చ జరిగింది. దీనిలో భాగంగా గండయ్య స్పందిస్తూ.. తాను ఇప్పటికే జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షిలను కలిసి దరఖాస్తు చేసుకున్నానన్నారు. పార్టీకి దశాబ్దాల పాటు తాను చేసిన కృషిని గుర్తించి తనకు చైర్మన్ పదవి ఇవ్వాలని ఆయన అధిష్టానాన్ని కోరారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



శంషాబాద్: పౌష్టికాహారంతోనే తల్లిబిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని నర్కూడ పీహెచ్‌సీ వైద్యురాలు దివ్య సూచించారు. పట్టణంలోని కొత్వాల్‌గూడలో పౌష్టికాహార మాసోత్సవంలో భాగంగా ఐసీడీఎస్ అధికారులు నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని ఇంట్లోనే తయారు చేసుకోవాలని సూచించారు. వైద్యులు అందిస్తున్న సూచనలను తప్పకుండా పాటించాలని కౌన్సిలర్ లక్ష్మీశ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూప, అధికారులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



సాయిచంద్

అత్తాపూర్: స్నేహితులను కలిసి వస్తానని ఇంట్లో చెప్పి ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్ ఓల్డ్ హనుమాన్ టెంపుల్ ప్రాంతంలో కుటుంబసభ్యులతో కలిసి దివ్యాంగుడైన సాయిచంద్ర(32కు రెండు కాళ్లు పనిచేయకపోవడంతో ఇంట్లోనే ఉంటాడు. కాగా మంగళవారం మధ్యాహ్నం 1.30 ప్రాంతంలో స్నేహితులను కలిసి వస్తానని చెప్పి ద్విచక్ర వాహనంపై (దివ్యాంగుల వాహనం) వెళ్లాడు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నియామకం



వై.శ్రీధర్

రాజేంద్రనగర్: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్‌గా బీజేపీ నాయకుడు వై.శ్రీధర్ నియమితులయ్యారు. జాయింట్ కన్వీనర్లుగా బొక్క బాల్‌రెడ్డి, కె.నరేందర్‌రెడ్డి, చంద్రయ్యలను నియమించారు. – రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం, సులేమాన్ నగర్ డివిజన్లకు కమిటీలను ఏర్పాటు చేశారు.

- రాజేంద్రనగర్ డివిజన్‌కు ఎం.శ్రీనివాస్‌గౌడ్, ఈ.వేణుగోపాల్, ఎస్.రాహుల్ రెడ్డి, అత్తాపూర్ డివిజన్‌కు కె.కిరణ్ చారి, జి.రాజు, ఎం.రాము, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌కు ఎం.జగన్, ఆర్.భాస్కర్, వెంకటరమణ, శాస్త్రీపురానికి ఆనంద్, శంకర్, భగవాన్, సులేమాన్ నగర్ డివిజన్‌కు విక్రంరెడ్డి, చంద్రశేఖర్, భవానీ శంకర్, మహేష్‌లను నియమించారు.

సాంకేతికతతోనే ప్రజా భద్రత




కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

మణికొండ: ప్రపంచవ్యాప్తంగా సాంకేతికత పెరిగిపోతుందని, దీంతో ప్రజలకు అనేక రకాల మేలు జరుగుతుందని ఉత్తర తెలంగాణ జోన్ పోలీస్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం సీబీఐటీలో నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెరిగిన సాంకేతికతో అనుక్షణం నిఘా ఏర్పాటు చేయడం, సైబర్ సెక్యూరిటీ, కమ్యూనికేషన్ సిస్టమ్ వినియోగం పోలీసింగ్‌లో పెరిగిందన్నారు. ఇంజినీర్లు సాంకేతికతలో పురోగతి ప్రజాభద్రత, చట్టం అమలుతో పాటు సామాజిక అభివృద్ధిపై ప్రత్యక్ష ప్రభావం గురించి వివరించారు. ఎంటర్‌ప్రైజ్ క్లౌడ్ యాప్స్ గ్లోబల్ హెడ్, వైస్ ప్రెసిడెంట్ జూలూరి అమర్‌నాథ్, ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, విభాగాధిపతులు, డైరెక్టర్లు, సలహాదారులు తదితరులున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య

మైలార్‌దేవ్‌పల్లి: అప్పుల బాధలు తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మిగూడ బృందావన్ కాలనీకి చెందిన పట్లోళ్ల సిద్ధు (40) వృత్తిరిత్యా డ్రైవర్‌గా పనిచేస్తూ.. జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య ఇద్దరు పిల్లలు సంతానం. కాగా గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. తెలిసిన వారి దగ్గర అప్పు తీసుకుని కట్టలేని పరిస్థితికి వచ్చాడు. బుధవారం అప్పు ఇచ్చిన వ్యక్తి దురుసుగా మాట్లాడటంతో మనస్తాపం చెంది ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో మరో వ్యక్తి ..



ముర్తుజా (ఫైల్)

అత్తాపూర్: భార్య, పిల్లలు దూరంగా ఉండటంతో మనోవేదనకు గురైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ సీతారాం నాయక్ తెలిపిన వివరాల ప్రకారం... అత్తాపూర్ కూయంనగర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ ముర్తుజా (43), జయానా బేగం భార్యభర్తలు. కాగా వీరికి ఇద్దరు కుమారులు. ముర్తుజా అబిడ్స్‌లో ఓ బొమ్మల షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంటారు. తాగుడుకు బానిస కావడంతో భార్య 8 ఏళ్ల క్రితం పిల్లలను తీసుకుని కర్నూల్ జిల్లా నంద్యాలకు తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. భార్య పిల్లలు దూరం కావడంతో మరింతగా కలత చెందిన అతడు పనికి వెళ్లకుండా ఇంట్లోనే మంగళవారం రాత్రి ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదకర విద్యుత్ స్తంభాల తొలగింపు



అలకాపూర్‌లో విద్యుత్ ఏఈ తో స్థానికులు

మణికొండ: ప్రమాదకరంగా ఉన్న 11కేవీ ఫీడర్ విద్యుత్ స్తంభాన్ని అధికారులు తొలగించారు. మణికొండ మున్సిపాలిటీ, అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 13 వద్ద ఓ విద్యుత్ స్తంభం వంగి ప్రమాదకరంగా మారింది. రోడ్డు మధ్యలో ఉండటంతో ప్రమాదాలు జరిగాయి. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లడంతో వారు విద్యుత్ శాఖకు వాటిని మార్చాలని సూచించారు. దీంతో బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపేసి రోడ్డుపై ఉన్న మరో మూడు స్తంభాలను మార్చి పెద్ద సమస్యను పరిష్కరించారు. విద్యుత్, మున్సిపల్ అధికారులతో పాటు ఎమ్మెల్యేకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు రుణాల మంజూరు



శంషాబాద్ రూరల్: మండలంలోని చిన్నగోల్కొండ సొసైటీ పరిధి రైతులకు బుధవారం స్వల్పకాలిక రుణాలను పంపిణీ చేశారు. 24 మంది రైతులకు రూ.22,35,000 చెక్కులను చైర్మన్ బి.దౌనాకర్‌గౌడ్ చేతుల మీదుగా అందజేశారు. సొసైటీ డైరెక్టర్ మోహన్‌రావు, సీఈఓ యాదయ్య, సిబ్బంది సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రధాన రహదారులపై ప్యాచ్ వర్క్స్ పనులను ప్రారంభించినట్లు ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. వర్షం కారణంగా ప్రధాన రహదారులతో పాటు బస్తీల్లో గుంతలు ఏర్పడ్డాయన్నారు. వీటిని పూడ్చేందుకు తక్షణ చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. డివిజన్ల వారీగా బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్యాచ్‌వర్క్స్ చేపట్టినట్లు వివరించారు. ప్రధాన రహదారులపై పనులు పూర్తయిన అనంతరం అంతర్గత బస్తీలలోని గుంతలను పూడ్చనున్నట్లు స్పష్టం చేశారు.